అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు 'అదర్ డ్యూటీ'

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తమ సంఘం కార్యకలాపాల్లో పాల్గొనేందుకు వీలుగా ప్రభుత్వం వారికి 'అదర్ డ్యూటీ' సౌకర్యం కల్పించింది. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ రఘునందన్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నత విద్య విభాగం, డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్, సచివాలయం ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

దేశంలోనే తొలి క్లైమేట్ చేంజ్ స్టేషన్

జమ్ము, ఏప్రిల్ 8: జమ్ము కశ్మీర్‌లోని ఉధంపూర్‌లో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి తొలి వాతావరణ మార్పుల పరిశోధన కేంద్రాన్ని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మంగళవారం ప్రారంభించారు. ఈ కేంద్రంతో హిమాలయాల పరిశోధనల్లో భారత్ ముందుంటుందని ఆయన అన్నారు. స్వేచ్ఛా, భూ వాతావరణంలో అతి తక్కువ సాంద్రత కలిగిన ప్రాంతంలోని పరిస్థితులు, మేఘాల నిర్మాణం, వాతావరణ నమూనాలు, వాతావరణ ప్రక్రియలను అధ్యయనం చేయడానికి ఈ కేంద్రం అవకాశాన్ని అందిస్తుంది.

నత్తతో కోల్‌కతా, బెంగళూరు పోటీ!

కోల్‌కతా: కోల్‌కతా, బెంగళూరు, పుణె నగరాల ట్రాఫిక్ నత్త నడకతో పోటీ పడుతున్నదని టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ 14వ ఎడిషన్ వెల్లడించింది. 2024లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న టాప్-5 ప్రపంచ నగరాల్లో ఈ మూడింటికి స్థానం లభించిందని చెప్పింది. ఫ్లోటింగ్ కార్ డాటా ఆధారంగా 62 దేశాల్లోని 500 నగరాలకు ఈ సూచీలో ర్యాంకులు ఇచ్చారు. ఇందులో కోల్‌కతా, బెంగళూరు, పుణె వరుసగా రెండు, మూడు, నాలుగో స్థానాల్లో నిలిచాయి. కోల్‌కతాలో కేవలం 10 కిలోమీటర్లు ప్రయాణించడానికి 34.33 నిమిషాల సమయం పడుతున్నట్టు తేలింది. ఇక బెంగళూరులో 10 కి.మీ ప్రయాణానికి సగటున 34.10 నిమిషాలు, పుణెలో 10 కి.మీ. ప్రయాణానికి సగటున 33.22 నిమిషాలు పడుతున్నది.

అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాల్సిందే..

- 11న జయంతిలోగా ప్రకటించాలి
- అనుముల ఇంటెలిజెన్స్‌తోనే రాష్ట్రానికి ప్రమాదం
- 50% రిజర్వేషన్లను కోర్టులు అడ్డుకోవు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద బీసీ దీక్ష

అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు వద్ద దీక్ష చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, బీసీ సంఘాల నేతలు

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ఈ నెల 11న ఆయన జయంతిలోగా విగ్రహ ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద మంగళవారం బీసీ దీక్ష చేపట్టారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ (టీపీఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన ఈ దీక్షా శిబిరానికి వేలాది మంది బీసీలు, ప్రజలు తరలివచ్చారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన ఈ శిబిరంలో బీసీ నేతలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. బీసీల కోసం పోరాడుతున్న ఎమ్మెల్సీ కవితకు బీసీలకు చెందిన ఆటోవాలాలు, హమాలీ కార్మికులతోపాటు న్యాయవాదులు, డాక్టర్లు, వృత్తిదారుల సంఘాల నేతలు సంఘీభావంగా పాల్గొని మద్దతు తెలిపారు. ఈ దీక్షను ఉద్దేశించి కవిత మాట్లాడారు. ఏఐ అంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాదని, అనుముల ఇంటెలిజెన్స్ అని ఎమ్మెల్సీ కవిత ఎద్దేవా చేశారు. ఈ అనుముల ఇంటెలిజెన్స్‌తోనే రాష్ట్రానికి ప్రమాదం ఉన్నదని, ఇప్పటికే రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నని, అనుముల ఇంటెలిజెన్స్ పక్కకు జరిగితే తప్పా రాష్ట్రం బాగుపడే పరిస్థితి కనిపించడం లేదని చెప్పారు. అసెంబ్లీ ఆమోదించిన రెండు బీసీ బిల్లుల స్థితి ఏమిటో ప్రభుత్వమే చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయా? లేదా? రాష్ట్రపతికి పంపారా? అని నిలదీశారు. ఈ బిల్లుల విషయంలో అవసరమైతే ఢిల్లీలో నిరవధికగా దీక్షలకు కూర్చుందామని పిలుపునిచ్చారు. దేశంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుతో 50 శాతం రిజర్వేషన్ పరిమితి తొలగిందని, 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించినా కోర్టులు అడ్డుకోలేవని తెలిపారు.

కేంద్రం మెడలు వంచాలంటే ఉద్యమాలే మార్గం

కేంద్ర ప్రభుత్వం మెడలు వంచాలంటే ప్రజా ఉద్యమాలే మార్గమని చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన రాజస్థాన్‌లో దళిత నేత, ప్రతిపక్ష నేత టికారాం జుల్లి శ్రీరామనవమి రోజు రాముడి గుడికి వెళ్తే, ఆ గుడి మైల పడిందని సంప్రోక్షణ చేశారని, అటువంటి దౌర్భాగ్యమైన పరిస్థితి దేశంలో ఉండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకే కాదు బీసీలకు కూడా సమాజంలో అనేక సందర్భాల్లో ఇప్పటికీ అవమానాలు జరుగుతున్నాయని, ఇవి సమాజానికి మంచిది కాదని, వీటిని రూపుమాపడానికి నడుంబిగించాలని కవిత పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆట, పాటలతోపాటు దీక్షా ప్రాంగణ పరిసరాలు మార్మోగాయి. అనంతరం ముఠా అయాన అనే 8 ఏండ్ల చిన్నారి అందించిన నిమ్మరసం సేవించిన ఎమ్మెల్సీ కవిత దీక్ష విరమించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్, యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రాంచందర్‌రావు , కో కన్వీనర్ బొల్ల శివశంకర్, ఆలకుంటల హరి, టీజీపీఎస్సీ మాజీ సభ్యుడు సుమిత్ర తనోబా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, నివేదిత సాయన్న, ఆశిష్‌యాదవ్, తెలంగాణ జాగృతి నాయకులు నవీన్ ఆచారి, శ్రీధర్ రావు, ప్రశాంత్ అనంతుల, మారేపల్లి మాధవి తదితరులు పాల్గొన్నారు.

తృణమూల్ ఎంపీల్లో అంతర్గత విభేదాలు

చాట్‌లు, వీడియోలు షేర్ చేసిన బీజేపీ • మీడియాతో మాట్లాడొద్దని మమత ఆదేశం

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీల మధ్య అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. దీనికి సంబంధించిన వీడియోలు, సంభాషణలను బీజేపీ లీక్ చేయడంతో ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ ఇబ్బంది పడ్డారు. ఎంపీలెవరూ మీడియాతో మాట్లాడొద్దని ఆదేశించారు. లీకైన వీడియోలపై టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ స్పందిస్తూ.. ఓ దురుసు ప్రవర్తన గల మహిళా ఎంపీ తనను అరెస్ట్ చేయించడానికి ప్రయత్నించిందని ఆరోపించారు. ఈ నెల 4న టీఎంసీ ఎంపీల బృందం ఎన్నికల సంఘానికి ఒక విజ్ఞప్తిని అందజేయడానికి వెళ్లినప్పుడు ఈ ఘటన జరిగింది. ఈ ఘటన జరిగినప్పుడు మరో ఎంపీ డెరెక్ ఒబ్రియాన్ కళ్యాణ్ బెనర్జీని శాంతింపచేయడానికి ప్రయత్నించారు. కళ్యాణ్ బెనర్జీ ఇటీవల ఓ మీడియా సమావేశంలో మాట్లాడుతూ సభ్యత లేని మహిళా ఎంపీని తాను ఆమోదించనని తెలిపారు. ఆమె పార్లమెంట్‌లో మాట్లాడేందుకు ఎక్కువ సమయం కావాలని డిమాండ్ చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దీనిపై మరో టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ స్పందిస్తూ కళ్యాణ్ బెనర్జీ తప్పుడు ప్రవర్తన వల్ల ఓ టీఎంసీ మహిళా ఎంపీ ఏడ్చారన్నారు. సౌగతా రాయ్ వ్యాఖ్యలపై కళ్యాణ్ బెనర్జీ స్పందిస్తూ.. అతడికి వ్యక్తిత్వం లేదని.. ఆయన నారదా స్కామ్‌లో దొరికిపోయారని విమర్శించారు.

బిల్లులు చెల్లించని సర్కార్

మాజీ సర్పంచ్ భర్త బలవన్మరణం

- కాకులబోర్డు తండాలో ఉరేసుకొని ఆత్మహత్య
- పంచాయతీ పనుల కోసం 30 లక్షల అప్పులు
- పెండింగ్ బిల్లులు చెల్లించని రాష్ట్ర ప్రభుత్వం
- ఆర్థిక ఇబ్బందులతో కిషన్‌నాయక్ మనస్తాపం
- ఇప్పటికే 13 మంది మాజీ సర్పంచుల ఆత్మహత్య
- ఇవి ప్రభుత్వ హత్యలే: సర్పంచుల సంఘం జేఏసీ

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు మొండివైఖరితో మాజీ సర్పంచుల కుటుంబాల్లో మరణమృదంగం మోగుతున్నది. చేసిన పనులకు బిల్లులు రాక, అప్పుల బాధ తాళలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో ఇప్పటికే 13 మంది మాజీ సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కాకులబోర్డు తండా మాజీ సర్పంచ్ గుగులోతు కౌసల్య భర్త కిషన్‌నాయక్ (50) అప్పులబాధతో ఉరేసుకొన్నారు. తన భార్య సర్పంచ్ అయిన నాటి నుంచి గ్రామంలో అభివృద్ధి పనుల కోసం రూ.30 లక్షల వరకు అప్పులు తీసుకొచ్చి పంచాయతీలో పనులు చేశారు. నేటికీ ఆ బిల్లులు రాకపోవడంతోపాటు వ్యవసాయం కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. అప్పు ఇచ్చిన బంధువులు ఒత్తిడి తేవడంతోపాటు ఇటీవల పెద్ద మనుషుల సమయంలో కిషన్‌నాయక్‌ను చెప్పుతో కొట్టారు. ఈ అప్పులబాధలు భరించలేక, మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబాబాద్ నుంచి ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

రూ.700 కోట్ల పంచాయతీ బిల్లులు పెండింగ్

రాష్ట్రంలోని 12,848 గ్రామ పంచాయతీల్లో మాజీ సర్పంచులు వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.700 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు రావాల్సి ఉన్నది. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ గవర్నర్‌తోపాటు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు పలుమార్లు మాజీ సర్పంచులు వినతిపత్రాలు అందజేశారు. వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. జనవరిలోగా ఇస్తాం, మార్చిలోగా ఇస్తామంటూ ప్రభుత్వ పెద్దలు కాలయాపన చేస్తూ వచ్చారు. కానీ, బిల్లులు మాత్రం చెల్లించడం లేదు. చేసిన అప్పులకు వడ్డీలు పెరగడం, అప్పులు ఇచ్చిన వారి నుంచి వేధింపులు అధికం కావడంతో ఇప్పటివరకు 13 మంది మాజీ సర్పంచులు ప్రాణాలను తీసుకున్నారు.

కిషన్‌నాయక్‌ది ప్రభుత్వ హత్యే: జేఏసీ

మాజీ సర్పంచ్ భర్త కిషన్‌నాయక్ ఆత్మహత్యను ప్రభుత్వహత్యగానే భావిస్తున్నామని, ఇంకా ఎంతమందిని బలి తీసుకుంటారని సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ప్రశ్నించారు. మృతుడి కుటుంబానికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు గ్రామానికి అభివృద్ధికి చేసిన పెండింగ్ బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ హైదరాబాద్‌లోని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో ఆందోళనకు దిగారు. ప్లకార్డులు చేతబట్టి మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద కిషన్‌నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షుడు కేశబోయిన మల్లయ్య, నాయకులు బొడ్డు నర్సింలు, సముద్రాల రమేశ్, మన్నె పద్మారెడ్డి, అరవిందర్‌రెడ్డి, ఓర్సు వెంకటేశ్, మంగ నర్సింలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి: సర్పంచుల సంఘం

గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు అందక ఇప్పటికే 13 మాజీ సర్పంచులు చనిపోయారని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ తీసుకొని మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేశారు. పెండింగ్ బిల్లులు విడుదలచేసే వరకు సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో పోరాడుతామని హెచ్చరించారు.

కడెం 22వ డిస్ట్రిబ్యూటరీ కాల్వకు సాగునీరు ఇవ్వాలని తపాలాపూర్ ప్రధాన రోడ్డుపై నిరసన తెలుపుతున్న రైతులు

సాగునీటికోసం రోడ్డెక్కిన రైతులు

- తపాలాపూర్ వద్ద వరి కంకితో బైఠాయింపు
- నీళ్లియ్యకపోతే 100 ఎకరాలు ఎండుతుందని ఆందోళన

జన్నారం, ఏప్రిల్ 8 : సాగునీటికోసం రైతులు రోడ్డెక్కారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తపాలాపూర్ వద్ద వరి కంకితో రోడ్డుపై బైఠాయించారు. కడెం 22వ డిస్ట్రిబ్యూటరీ కాల్వ కింద రాపూర్, తిమ్మాపూర్, తపాలాపూర్ గ్రామాల రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఈ పంటలకు మరో రెండు తడులకు సాగునీటిని అందించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ప్రధాన రోడ్డుపై నిరసన తెలిపారు. నీరందకపోతే దాదాపు 100 ఎకరాల వరకు పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. కడెం ఉన్నతాధికారులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పందించి నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలో ప్రాజెక్టు సర్వే పనులను అడ్డుకుంటున్న నిర్వాసిత రైతులు

ఉమామహేశ్వర ప్రాజెక్టును అడ్డుకుంటం

- బల్మూరు మండల ప్రజల హెచ్చరిక
- అనంతవరం శివారులో సర్వే పనుల అడ్డగింత

అచ్చంపేట రూరల్, ఏప్రిల్ 8 : ఉమామహేశ్వర ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని అనంతవరం శివారులో రైతులు ఆందోళనకు దిగారు. మంగళవారం ప్రాజెక్టు నిర్మాణ సర్వే పనులను ప్రారంభించడానికి వచ్చిన అధికారులను అనంతవరం, అంబగిరి, బల్మూరు గ్రామాల రైతులు నిలదీశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. రిజర్వాయర్ నిర్మాణంతో రైతులకు లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. రెండు పంటలు పండించే తాము దాదాపు 2,067 ఎకరాలను కోల్పోయి రోడ్డునపడే ప్రమాదం ఉన్నదని ఆవేదన చెందారు. ఒకవేళ నిర్మిస్తే కేవలం 360 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందే అవకాశం ఉన్నదని తెలిపారు. అందుకే తమ ప్రాణాలు పోయినా పనులను అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రాజెక్టు నిర్మాణం నిలిపివేసి భూ నిర్వాసితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చి.. నేడు కోర్టు ఆర్డర్‌ను ధిక్కరించి స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ పనులు ప్రారంభించడం సరికాదని అన్నారు.



సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తమ్మరలో రాస్తారోకో చేస్తున్న రైతులు

వడ్లెప్పుడు కొంటరు?

మొదటిపేజీ తరువాయి...

రైతులు ఆందోళనకు దిగారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తమ్మరలో హడావుడిగా కేంద్రాన్ని ప్రారంభించి రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడంతో రైతులు ఐకేపీ సెంటర్ ఎదురుగా కోదాడ-ఖమ్మం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. వాహనాలు భారీగా నిలిచిపోవడంతో పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళనను విరమింపజేశారు. ఈ సందర్భంగా రైతులు, నాయకులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో టెంట్ మాత్రమే వేశారని, సిబ్బందికి రసీదు బుక్కులు ఇవ్వలేదని, తేమ యంత్రాలు, గన్నీ బస్తాలు, సన్నాలు కొలిచే మెషిన్, బ్లోయర్లు లేకుండా ఎలా కొనుగోళ్లు చేస్తారని ప్రశ్నించారు. కాగా నల్లగొండ జిల్లా తిప్పర్తిలోనూ రైతులు నిరసనకు దిగారు. కొర్రీల పేరుతో కొనుగోళ్లు నిలిపివేశారంటూ రైతులు తిప్పర్తిలో నార్కట్‌పల్లి-అద్దంకి హైవేపై బైఠాయించారు. సకాలంలో కొనకపోతే అకాల వర్షానికి ధాన్యం తడిసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు.

నిజామాబాద్ జిల్లా కోటగిరి తహసీల్దార్ ఆఫీస్ ఎదుట రైతులు నిరసన

నిజామాబాద్ జిల్లా గోన్‌గొప్పలలో రైతుల ఆందోళన

తరుగుపై రైతుల నిరసన

ధాన్యం కొనుగోళ్లలో తరుగు తీయడాన్ని నిరసిస్తూ నిజామాబాద్ జిల్లా కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నాకు దిగారు. 40 కిలోల బస్తాకు 2 కిలోల తరుగు తీయడం ఏమిటని మండిపడ్డారు. రైతుల శ్రమను దోచుకుంటుంటే అధికారులు పట్టించుకోరా? అని ప్రశ్నించారు. అనంతరం కడ్తాను నియంత్రించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కాగా ఇదే జిల్లా భీమ్‌గల్ మండలం గోన్‌గొప్పులలోనూ రైతులు ధర్నాకు దిగారు. స్థానిక ఐకేపీ కొనుగోలు కేంద్రంలో 40 కిలోల బస్తాకు దాదాపు రెండు కిలోల తరుగు తీస్తున్నారని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ షబ్బీర్, ఎస్సై మహేశ్ అక్కడికి చేరుకొని వారికి సర్దిచెప్పారు. ఇకపై రైతులు కోరిన విధంగానే కాంటాలు వేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

2013 చట్టం ప్రకారం భూసేకరణ చేయండి

మంచిర్యాల జిల్లా ఇండస్ట్రియల్ పార్క్‌పై హైకోర్టు ఆదేశం

మంచిర్యాల, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాలలో నిర్మిస్తున్న ఇండస్ట్రియల్ పార్క్ కోసం 2013 భూసేకరణ చట్టం ప్రకారమే రైతులనుంచి భూములను సేకరించాలని హైకోర్టు ఆదేశించింది. రైతుల అభ్యంతరాలను పరిగణనలోనికి తీసుకోవాలని సూచించింది. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం వేంపల్లి, పోచంపాడ్ గ్రామాల్లో 276.09 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూసేకరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు భూములు ఇవ్వాలంటూ కొందరు రాజకీయ నాయకులు రైతులను బెదిరించి, బలవంతంగా తెల్లకాగితాలపై సంతకాలు చేయిస్తున్నట్టు ఆరోపణలు వచ్చాయి. బాధితులను బెదిరించిన తీరుపై వార్తా కథనాలు సైతం ప్రచురితమయ్యాయి. దీనిపై రైతులు గజ్జెల్లి లక్ష్మి, అనసూయ, దొమ్మాటి అర్జున్, మాడుగుల లింగయ్య ఇటీవల హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను విచారించిన హైకోర్టు పూర్తి చట్టబద్ధంగా భూసేకరణ చేపట్టాలని, భూ యజమానుల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించింది. ప్రజాప్రయోజనాల కోసం భూ సేకరణ చేయాల్సి వస్తే 2013 భూసేకరణ చట్టం, సెక్షన్ 11 ప్రకారం నోటిఫికేషన్ జారీచేసి బాధిత రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చూడాలని ప్రతివాదులుగా ఉన్న కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు ఆదేశాలు జారీచేసింది. ఇప్పటికైనా అధికారులు 2013 భూసేకరణ చట్టాన్ని అనుసరించి నోటిఫికేషన్ జారీ చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లికార్జున్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కే మల్లికార్జున్‌రెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కే శారద, ఆర్థిక కార్యదర్శిగా సీహెచ్ శౌరి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పీ పార్థసారథి, సీహెచ్ ప్రభాకర్, చీఫ్ ప్యాట్రన్లుగా కేఎస్ ప్రకాశ్‌రావు, జీవీ బద్రినారాయణరావులను ఎన్నుకున్నారు.

ఏసీబీ వలలో అవినీతి చేప

జమ్మికుంట సెర్ప్‌లో రూ.10 వేలు తీసుకుంటుండగా సీసీ పట్టివేత

సీసీ సురేశ్

జమ్మికుంట, ఏప్రిల్ 8: గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థకు చెందిన ఓ అవినీతి చేప ఏసీబీకి చిక్కింది. గ్రామైక్య సహాయకురాలికి నెలనెలా వచ్చే గౌరవ వేతనం రిలీజ్ చేసేందుకు లంచం డిమాండ్ చేసి, మంగళవారం అడ్డంగా దొరికిపోయింది. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, బాధితురాలు వీవోఏ స్వప్న తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం పెద్దంపల్లిలో శ్రీరాజరాజేశ్వర గ్రామైక్య సంఘానికి సహాయకురాలిగా దొడ్డె స్వప్న పనిచేస్తున్నది. ఆమెకు ప్రాజెక్టు నుంచి నెలకు రూ.5వేల గౌరవ వేతనం గ్రామైక్య సంఘం ఖాతాలో పడుతున్నది. ఆ డబ్బు తీసుకోవాలంటే సంఘం లీడర్లతో పాటూ సెర్ప్ సీసీ అనుమతి తప్పనిసరి. దీనిని సీసీ సురేశ్ ఆసరాగా చేసుకుని.. లంచం ఇస్తేనే గౌరవ వేతనం రిలీజ్ చేయిస్తానని ఐదు నెలలుగా అడ్డుకుంటున్నాడు. స్వప్న మంగళవారం సెర్ప్ కార్యాలయానికి వచ్చి రూ.10వేలను సీసీ సురేశ్‌కు ఇచ్చారు. వెంటనే ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ.10వేలు లంచం

ఏసీబీకి చిక్కిన చింతలపాలెం ఎస్సై

ఎస్సై అంతిరెడ్డి

చింతలపాలెం, ఏప్రిల్ 8 : పీడీఎస్ బియ్యం కేసులో స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు లంచం తీసుకుంటూ ఓ ఎస్సై ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో చోటుచేసుకున్నది. నిరుడు అక్టోబర్ 23న పీడీఎస్ బియ్యం రవాణా విషయంలో ఆరుగురిపై కేసు నమోదైంది. కేసులో ఓ వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు ఎస్సై రూ.15 వేలు డిమాండ్ చేయగా చివరకు రూ.10 వేలకు ఒప్పందం కుదిరింది. రూ.10 వేలు లంచం తీసుకోగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.